## క్లుప్తంగా

### స్ఫటిక లింగానికి అభిషేకం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని యోగేశ్వర్ దేవీదయాల్ మహాదేవ్ జ్యోతిర్లింగ్ దేవస్థానంలో సోమవారం స్వామి అమిత్ దేవ్ జీ మహారాజ్ స్ఫటిక లింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ దేవ్ జీ మహారాజ్ మాట్లాడుతూ 40 రోజుల దక్షిణ భారత పర్యటనలో భాగంగా నున్నలోని యోగేశ్వర్ దేవి దయాల్ మహాదేవ్ జ్యోతిర్లింగ్ దేవస్థానానికి రావడం జరిగిందన్నారు. యోగేశ్వర్ రాంలాల్ జీ ములాఖ్ రాజ్ జీ, దేవిదయాల్ జీ సురేందర్ దేవ్ జీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో 40 రోజుల పాటు స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు



ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి దైవభక్తి కలిగి జీవించిన గొప్ప విశ్వాసి అని కర్నూల్ మేత్రాసనం ఆదోని డీన్ ఫాదర్ కోల విజయరాజు అన్నారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాల్లో భాగం నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు సోమవారం మూడవ రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఫాదర్ విజయరాజు పుణ్యక్షేత్ర ఫాదర్లతో కలిసి దివ్యపూజాబలిని సమర్పించారు. తన సందేశంలో విశ్వాసము క్రైస్తవ జీవితం అనే అంశంపై ప్రసంగించారు. తంబి మధ్యస్థ ప్రార్థనల వల్ల మేలులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కల్దరారో నగర్ సంఘస్తులు కొనియాడారు. పుణ్యక్షేత్ర రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువు గోపి అభిలాష్, సంఘస్తులు పాల్గొన్నారు.

### 12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో ఈ నెల 12వ తేదీన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎల్ ప్రసాద్, ఎస్ బాలమురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చదువుకున్న అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని వారు కోరారు.

# మల్లవల్లిలో కొనసాగుతున్న దౌర్జన్యకాండ

**యుద్ధ ప్రాతిపదికన రోడ్ల నిర్మాణం**

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో అధికార యంత్రాంగం దౌర్జన్యకాండ నాలుగు రోజులుగా కొనసాగుతోంది. పారిశ్రామికవాడ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా, ఆ భూముల్లో యుద్ధప్రాతిపదికన జంగిల్ క్లియర్, ప్లాట్ల విభజన, రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మల్లవల్లి రీసర్వే 11లోని 1,460 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ ఏర్పాటుకు సేకరించింది. కానీ దశాబ్దాలుగా ఈ భూములు సాగుచేస్తూ జీవిస్తున్న కొందరు పేదలకు అధికారులు రకరకాల కారణాలతో నేటికి పరిహారం మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టిన సాగుదారులను అణిచివేసేందుకు కూటమి ప్రభుత్వం పోలీసు బలగాలతో చర్యలకు దిగింది. గత నాలుగు రోజులుగా భూనిర్వాసితులను గృహ నిర్బంధం చేసి, వారి భూములను యథేచ్ఛగా స్వాధీనం చేసుకుంటున్నారు. అంతేకాక యుద్ధప్రాతిపదిన సుమారు 300 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటుగా, పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ప్లాట్ల విభజన, బీటీ రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ, సర్వే యంత్రాంగం మల్లవల్లి పారిశ్రామికవాడలో మోహరించారు. వందలాది పోలీసులు గ్రామంలోనూ, పారిశ్రామికవాడలోనూ బందోబస్తు నిర్వహిస్తున్నారు. పారిశ్రామికవాడలోకి ఇతరులను ఎవ్వరిని అనుమతించకుండా భారికేట్లు ఏర్పాటు చేశారు. ఎనిమిదేళ్లుగా పరిహారం కోసం కళ్లు కాయలు కాసేటట్లు ఎదురుచూస్తున్న సాగుదారులను నిర్దాక్షిణ్యంగా ఇళ్లలో బందించి, వారి భూములను బలవంతంగా లాక్కుంటున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది.



మల్లవల్లి పారిశ్రామికవాడలో రోడ్డు నిర్మాణం



నాలుగు రోజుల్లో యుద్ధప్రాతిపదికన పూర్తి చేసిన రోడ్డు

# నంద్యాల జిల్లా బాలిక వీరవల్లిలో లభ్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇంటి నుంచి పారిపోయిన 11 ఏళ్ల బాలికను వీరవల్లి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని పున్నపురం కాలనీకి చెందిన గొర్రెల వసంత తన కుమార్తె దీపికతో కలిసి దాదాపు 40 రోజుల క్రితం ఇంటి నుంచి పరారైంది. భర్త రవితో గొడవ పడి కుమార్తె దీపికను తీసుకుని ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయినట్లుగా పోలీసుల విచారణలో తెలిసింది. కాగా తల్లిని విడిచిపెట్టి దీపిక మరో బస్సు ఎక్కి వీరవల్లికి చేరింది. ఒంటరిగా బస్సు దిగిన దీపికపై అనుమానంతో కండక్టర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీంతో ఎస్ఐ ఎం.శ్రీనివాసు, ఏఎస్ఐ ఎం.బ్రహ్మయ్య ఆ బాలిక నుంచి చాకచాక్యంగా వివరాలు ఆరా తీశారు. తల్లి వసంత, కుమార్తె దీపిక అదృశ్యంపై నంద్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. అంతేకాక తండ్రి రవి, ఇతర కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లను దీపిక నుంచి సేకరించి, వారికి ఫోన్లు చేశారు. కాగా, దీపికతో పాటుగా ఇంటి నుంచి వచ్చేసిన తల్లి వసంత ఆచూకీ పోలీసులకు లభ్యం కాలేదు. వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ఉండవచ్చనే అనుమానంతో పోలీసులు గాలిస్తున్నారు.



బాలిక దీపికతో వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ బ్రహ్మయ్య

# పుస్తక పఠనంతో సంపూర్ణ వికాసం

- ప్రతి జిల్లా కేంద్రంలోనూ పుస్తక మహోత్సవాలు ఏర్పాటుకు కృషి
- మంత్రి కందుల దుర్గేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పుస్తక పఠనం ద్వారానే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో పుస్తక మహోత్సవంలో భాగంగా సోమవారం పుస్తక ప్రియుల పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్ర ముగింపు సభ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. ఒక విషయం మీద సమగ్ర అవగాహన ఏర్పరుచుకొనేందుకు పుస్తకాన్ని మించిన సాధనం లేదన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ పుస్తక మహోత్సవాలు ఏర్పాటు చేసేందుకు కృషి జరగాలన్నారు. రాష్ట్రంలోని చరిత్రాత్మక గ్రంథాలయాల ఆధారంగా సాహితీ పర్యాటకానికి శ్రీకారం చుట్టాలని ప్రయత్నిస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండూ కొనసాగించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలకు అభినందనలు**

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో ముద్రించిన పుస్తకానికి కాలం చెల్లిందనేది అవాస్తవమని అభిప్రాయపడ్డారు. రోజూ చదువుతూ ఉంటేనే చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుని తగిన విధంగా మనల్ని మనం అభివృద్ధి చేసేందుకు సాధ్యమవుతుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలైన పెనుగొండ లక్ష్మీనారాయణ, రమేష్ కార్తీక్ నాయక్‌కు అభినందనలు తెలియజేశారు. సాహితీవేత్త రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు చదివి అభివృద్ధి చెందిన వ్యక్తులు ఎందరో ఉన్నారని చెప్పారు. సాహిత్యం చదవడం విద్యార్థి జీవితంలో భాగం కావాలని ఆకాంక్షించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పిల్లలు మంచి పుస్తకాలను ఎంపిక చేసుకోవడం నేర్చుకోవాలని సూచించారు. అప్పుడే వారి ముందుయుగం దూతలుగా మారతారని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత పెనుగొండ లక్ష్మీనారాయణ, సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్‌లను పుస్తక మహోత్సవం నిర్వాహకులు సత్కరించారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మయ్య, టి.మనోహర్‌నాయుడు, గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, ఎమెస్కో అధినేత డి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, నిర్వాహకులు

**సందడిగా పుస్తక ప్రియుల పాదయాత్ర**

పుస్తక మహోత్సవంలో భాగంగా నిర్వహించిన పుస్తక ప్రియుల పాదయాత్ర సోమవారం సందడిగా సాగింది. బందర్ రోడ్డులోని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు పలువురు సాహితీవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

### జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు

**ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్**

ఉయ్యూరు: సంక్రాంతి పండుగ పేరుతో జూద క్రీడలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్, పశుసంవర్ధకశాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ షారోన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జూదం, కోడిపందేలు ఆడకుండా చూడాలన్నారు. పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. చట్టాన్ని ఎవరు అతిక్రమించినా ఉపేక్షించొద్దని పేర్కొన్నారు. ప్రజలందరూ సాంప్రదాయబద్ధంగా, సంతోషంగా పండుగ జరుపుకోవాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం కోడిపందేలు, జూదం నిర్వహిస్తే నేరమంటూ బ్యానర్లను ఆవిష్కరించారు.

కంకిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ.. కోడి పందేలు, జూదం నిర్వహణ, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినా చర్యలు ఉంటాయన్నారు. ఎంపీడీఓ అనూష, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

**పెనమలూరులో సమీక్షా సమావేశం**

పెనమలూరు: పెనమలూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మార్వో కె.గోపాలకృష్ణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎవరైనా చట్ట విరుద్ధంగా జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రణవి, సీఐ వెంకటరమణ, ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ కిరణ్, డెప్యూటీ తహసీల్దార్ భవాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యానికి బానిసై ఆత్మహత్య

పెనమలూరు: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఫిరోజ్ కథనం మేరకు.. పెదపులిపాక గ్రామం మసీదు వద్ద షేక్ జిలాని(25) తల్లి నూర్జహాన్‌తో కలిసి ఉంటున్నాడు. జిలాని పెయింటర్‌గా పని చేస్తాడు. వచ్చిన సొమ్ముతో ప్రతి రోజూ మద్యం సేవిస్తాడు. ఈ విషయమై తల్లి నూర్జహాన్, అతని సోదరుడు సుభాని గత నెల 27వ తేదీన మద్యం సేవించి వచ్చిన జిలానిని మందలించారు. దీంతో అతను కలుపు మందు తాగి ఇంటికి రాగా అతడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి దుర్మరణం



పెనమలూరు: రహదారిపై నిలిపి ఉన్న లారీని బైక్‌పై వచ్చిన వ్యక్తి వెనుక నుంచి ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి 100 అడుగుల రోడ్డులోని ఆదర్శ అపార్టుమెంట్ ప్రాంగణంలో దామచర్ల సత్య గెస్ట్ హౌస్‌లో ఒడిశా రాష్ట్రం సబేరా గ్రామానికి చెందిన సుదాయ్‌బెహరా(29) గత ఆరు నెలలుగా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బైక్‌పై కానూరు వెళ్లి.. తిరిగి వచ్చే క్రమంలో ఇంజినీరింగ్ కాలేజీ ఫ్లై ఓవర్ దిగి కిందకు రాగా చీకట్లో రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బైక్ లారీ కిందకు దూసుకుపోవడంతో తీవ్ర గాయాలై దుర్మరణం చెందాడు. ఘటనపై గెస్ట్ హౌస్ మేనేజర్ కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### కరాటేలో బంగారు పతకం

పెనమలూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలో నైనా బంగారు పతకం సాధించింది. ఈ మేరకు యనమలకుదురుకు చెందిన కరాటే కోచ్ ఎస్.దుర్గారావు సోమవారం వివరాలు తెలుపుతూ.. ఈ నెల ఐదో తేదీన తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జరిగిన రాజీవ్‌గాంధీ మెమోరియల్ నేషనల్ కరాటే పోటీలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని జి.నైనా ఆరు సంవత్సరాల్లోపు ఎల్లో బెల్టు కాటా విభాగంలో బంగారు పతకం సాధించిందని తెలిపారు. సినీనటుడు కేశవ (పుష్ప ఫేమ్) చేతుల మీదుగా బహుమతి అందజేశారని పేర్కొన్నారు.



బంగారు పతకం సాధించిన నైనా

### బీఐఎస్‌తో పీవీపీ ఎంవోయూ

పెనమలూరు: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)తో కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎంవోయూ చేసుకుంది. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు సోమవారం వివరాలు తెలుపుతూ.. పీవీపీ సిద్ధార్థలో ఇండియన్ స్టాండర్డ్ క్లబ్ ప్రారంభించామన్నారు. ఇది దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌తో తమ కాలేజీ అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. విజయవాడ బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రమాకాంత్ సాగర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో పెరుగుతున్న నాణ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఒప్పందం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జగదీష్ వెంగల, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంవోయూ చేసుకున్న పీవీపీ ప్రిన్సిపాల్ శివాజీబాబు, బీఐఎస్ రమాకాంత్ సాగర్

# మంత్రి సారథి అక్రమ మైనింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు

**గన్నవరం టీడీపీ నేతల ఆరోపణ**

గన్నవరం: నూజివీడు నియోజకవర్గంలో మంత్రి కొలుసు పార్థసారథి అక్రమ మైనింగ్‌ను ప్రోత్సాహించడంతో పాటు ప్రతిపక్ష నేతలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నారని గన్నవరం నియోజకవర్గ టీడీపీ నేతలు ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం టీడీపీ నేతలు దొంతు చిన్నా, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, బచ్చుల సుబ్రమణ్యం, పరుచూరి నరేశ్, మేడేపల్లి రమాదేవి విలేకరుల సమావేశం నిర్వహించి, మంత్రి పార్థసారథిపై ఆరోపణలు గుప్పించారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే అనుచరుడైన కడియాల సురేశ్, మంత్రి పార్థసారథి అనుచరుడైన లింగమనేని కిశోర్ కలిసి నూజివీడులో అక్రమ మైనింగ్ చేస్తున్నారన్నారు. ఇటీవల వీరికి చెందిన లారీలను తహసీల్దారు పట్టుకుంటే స్వయంగా మంత్రి సారథి ఫోన్‌చేసి విడిపించారని తెలిపారు. కేసరపల్లిలో జరిగిన సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం సభ వేదిక వద్ద గ్రావెల్‌తో లెవలింగ్ పనులకు గాను సతీశ్ రూ. 2.41 కోట్ల బిల్లు చేశారని, ఈ పనులను అప్పగించింది సాక్షాత్తూ మంత్రేనని తెలిపారు. నూజివీడు కేంద్రంగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన ప్రతిపక్ష నేతలకు మంత్రి ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నారని చెప్పారు. యార్లగడ్డకు క్యారెక్టర్ ఉందని, పార్థసారథిలా రామోజీరావును ఆరోజు తిట్టి, ఈరోజు సంస్మరణ సభలు పెట్టలేదన్నారు. గన్నవరంకు చెందిన ప్రతిపక్ష నేతలు రోజూ మంత్రి సారథిని కలుస్తున్నారని చెప్పారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలకు చెందిన ప్రతిపక్ష నేతలే ఆర్థిక మేలు పొందుతున్నారన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూడా గన్నవరం, నూజివీడు ఉమ్మడి డీసీ పదవులను అధికారులను బెదిరించి మంత్రి లాక్కున్నారని ఆరోపించారు. టీడీపీ నేతలు దయాల రాజేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గన్నవరం టీడీపీ నేతలు

# వ్యాపార ప్రగతిలో ఉయ్యూరు

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్న పట్టణం

**ఉయ్యూరు/కంకిపాడు:** విజయవాడ–మచిలీపట్నం జిల్లా కేంద్రాలకు సెంటరుగా ఉన్న ఉయ్యూరు పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పూర్వం వ్యవసాయ రంగానికే పరిమితమైన ఈ ప్రాంతం నేడు అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతోంది. 100 గ్రామాలకు కూడలిగా ఉన్న పట్టణం విద్య, వైద్యం, వ్యాపారం, వాణిజ్యం , నిర్మాణ రంగాలకు కేంద్రంగా మారింది. కలప వ్యాపారంలో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయి.

### విద్యారంగంలో అగ్రగామి

విద్యారంగంలో ఉయ్యూరు అగ్రగామిగా నిలుస్తోంది. శ్రీ విశ్వశాంతి, శ్రీ శ్రీనివాసా, ఎంకే గ్రూప్స్, ఏజీఅండ్ఎస్‌జీ, శ్రీ జ్యోతి పాలిటెక్నిక్ వంటి విద్యాసంస్థలు స్థానికంగా విద్యాప్రగతికి పాటుపడుతున్నాయి. ఇంగ్లీషు మీడియం పరిచయం లేని రోజుల్లో శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థ ఇక్కడ సంస్థను ఏర్పాటుచేసి గ్రామీణ ప్రజానీకానికి ఆంగ్ల మాధ్యమాన్ని పరిచయం చేసింది. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు, సాంకేతిక విద్యాలయాలు ఏర్పాటుతో సీబీఎస్ఈ, ఇంగ్లీషు మీడియం, పీజీ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి.

### విస్తరిస్తున్న నిర్మాణ రంగం

నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ వ్యాపారం రోజు రోజుకు విస్తరిస్తోంది. రియల్ సంస్థలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నాయి. వ్యక్తిగత, గ్రూప్‌హౌస్, అపార్టుమెంట్లను అందుబాటులోకి తెస్తున్నాయి.


ఉయ్యూరు కేసీపీ కర్మాగారం

### వైద్య రంగానికి ప్రత్యేకం

ఒకప్పుడు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా విజయవాడకు వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు ఉయ్యూరు పరిసరాల్లో కార్పొరేట్ వైద్య సంస్థలు అనేకం ఆసుపత్రులను ఏర్పాటుచేసి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాయి. దంత, కంటి, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గుండె, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, చర్మవ్యాధులు వంటి సేవలతో పాటు స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రజలు వ్యయ ప్రయాసల కోర్చి వైద్యానికి పరుగులు పెట్టాల్సిన అవసరం లేకుండా పోయింది.

### జాతీయ స్థాయిలో ఖ్యాతి

కేసీపీ చక్కెర కర్మాగారం, సుధీర్ టింబర్ డిపో వంటి సంస్థలతో ఉయ్యూరుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానం లభించింది. వివిధ రాష్ట్రాల నుంచి కలప కోసం ఇక్కడికే వస్తుంటారు. అన్ని తరగతుల వారికీ అవసరమైన కలప రకాలు అందిస్తూ ఉయ్యూరు పట్టణం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. వీటితో పాటు చిన్న తరహా పరిశ్రమలు, కర్మాగారాలు, వ్యాపార సముదాయాలతో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు, రైతులకు ప్రత్యక్ష, పరోక్ష మార్గాల్లో జీవనోపాధిని పొందుతున్నారు.

ప్రశాంత వాతావరణానికి ఉయ్యూరు పరిసరాలు పేరొందడంతో కొనుగోలు దారులు ఈ ప్రాంతం వైపు చూస్తున్నారు. మరోవైపు విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో ప్రగతి సాధిస్తుండటంతో రియల్ వ్యాపారులు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు.


శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థ


ఉయ్యూరులో ఆసుపత్రి, వాణిజ్య సముదాయం


ఉయ్యూరు పట్టణంలోని ప్రధాన కూడలి

### వర్తక వాణిజ్యంలో మేటి

పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు, మాల్స్, వస్త్ర దుకాణాలు, విద్యుత్ పరికరాలకు సంబంధించిన సంస్థలు వ్యాపారాన్ని విస్తరించుకునే క్రమంలో ఉయ్యూరుపై దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువత ఎలక్ట్రానిక్, వస్త్ర, మొబైల్, హోటల్స్ రంగాల్లో ప్రవేశించి కార్పొరేట్‌కు ధీటుగా సంస్థలను నెలకొల్పారు. ఆటో మొబైల్స్, అన్ని రకాల ద్విచక్రవాహనాల షోరూమ్స్, రెస్టారెంట్లు, సినిమా హాల్స్, బంగారు దుకాణాలు అందుబాటులో ఉన్నాయి.

### వ్యాపార రంగంలో వృద్ధి



వ్యాపార రంగంలో గణనీయమైన వృద్ధి సాధిస్తున్నాం. ఒకప్పటి ఉయ్యూరు పట్టణానికి, నేటి పట్టణానికి ఎంతో వ్యత్యాసం ఉంది. గతంలో ఇంటికి అవసరమైన అన్ని వస్తువులు విజయవాడ పరిసరాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఇప్పుడు అన్నీ ఇక్కడే అందుబాటులో ఉన్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, వ్యక్తులు ఉయ్యూరు వచ్చి కలప కొనుగోలు చేస్తున్నారు. విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య, నిర్మాణ రంగాల అభివృద్ధి, విస్తరణతో వేలాది మందికి ఉపాధి లభిస్తోంది.

– నూకల వెంకట సాంబశివరావు,
ఎండీ, సుధీర్ టింబర్ డిపో, ఉయ్యూరు

### విద్యారంగంలో ప్రగతి



ఉయ్యూరు విద్యారంగంలో ప్రగతి సాధిస్తోంది. కేజీ నుంచి పీజీ, సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చింది. ఉయ్యూరుతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎవరూ వేరే నగరాలకు వెళ్లి తమ పిల్లలను చదివించుకోవాల్సిన పని లేకుండా స్థానికంగానే చదివించుకుంటున్నారు. నాణ్యమైన విద్య అందుతోంది. ఈ ప్రాంత విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్య, క్రీడలు, ప్రతిభా రంగాల్లో సత్తా చాటుతున్నారు.

– సూరపనేని వెంకటరమణ,
జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్